


వేధిస్తున్న అకాల వర్షం
» మహబూబ్ నగర్, వనపర్తి జిల్లాల్లో నష్టం



6
సోలీపూర్‌లో ఆకాశంలో మెరుపులీల

అర టీఎంసీ అదనమే

» ఏదుల నుంచి డిండికి నీటి తరలింపుపై మంత్రి ఉత్తమ్ స్పష్టత
» స్టాండ్‌బై మోటార్లను కూడా వినియోగించుకోవాలని ఇరిగేషన్ శాఖ నిర్ణయం
» అంతా అనుకున్నట్లు జరిగితే అనిశ్చితి వీడినట్లే

● మహబూబ్‌నగర్ జిల్లాకే ప్రాధాన్యమివ్వాలి



కృష్ణానది జలాల వినియోగం విషయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలకే హక్కులు అధికంగా ఉన్నాయి. ఈ ప్రాంత రైతుల సాగునీటి ప్రయోజనాలు తీరాకే మిగతా జిల్లాలకు కృష్ణానది జలాలను తరలించాలి. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం రాబోయే రెండేళ్లల్లో పూర్తి కావాలంటే మొదట తీర్నాంపల్లి నుంచి కుడికిళ్ల వరకు మెయిన్ కెనాల్ పనులు పూర్తి కావాలి. పంపుహౌజ్‌లలో ఎలక్ట్రికేషన్ కోసం బడ్జెట్‌లో కేటాయించిన నిధులు అరకొరగా ఉన్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకా పదేండ్లైనా ప్రాజెక్టు పూర్తి కాదు. ఏదుల నుంచి డిండికి అర టీఎంసీ తరలింపు వ్యవహారంపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలి.

- నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఏదుల నుంచి డిండికి నీటి తరలింపు వ్యవహారంపై ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టత ఇచ్చారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా నల్గొండ జిల్లాకు తీసుకెళ్తున్న అర టీఎంసీ నీరు అదనమేనని క్లారిటీ ఇచ్చారు. గురువారం నార్లాపూర్ నుంచి వట్టెం పంపుహౌజ్ వరకు పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను ఆయన పరిశీలించారు. పనుల పురోగతికి యుద్ధప్రాతిపదికన కేటాయించాల్సిన నిధులు రెండేళ్లలో ప్రాజెక్టును పూర్తి చేయడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించేందుకు అధికారులతో సమీక్షించారు. మంత్రితో కలిసి పనుల పర్యవేక్షణకు వెళ్లిన జిల్లా ఎమ్మెల్యేలు ఏదుల నుంచి డిండికి నీటి తరలింపు వ్యవహారంలో ఈ ప్రాంత ప్రజల్లో నెలకొన్న ఆందోళన గురించి అంతర్గత సమావేశంలో మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు సమాచారం. వారి అభిప్రాయాన్ని కూడా తెలుసుకున్న మంత్రి పాలమూరు రంగారెడ్డి జిల్లా ఎత్తిపోతల పథకంలో లబ్ధి చేకూరే ప్రాంతాల రైతులకు నష్టం వాటిల్లకుండానే ఏదుల ద్వారా డిండికి నీటిని తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు తెలిసింది.



నార్లాపూర్‌లోని మొదటి పంపుహౌజ్ (ఫైల్)

● నీటి తరలింపునకు ప్రత్యేక కార్యాచరణ

ఏదుల నుంచి డిండికి అర టీఎంసీ నీటిని కేటాయించాలని నిర్ణయించిన నేపథ్యంలో క్యాబినెట్ ఆమోదానికి ముందే ఇరిగేషన్ శాఖ ప్రత్యేక కార్యాచరణను రూపొందించినట్లు తెలిసింది. ఉమ్మడి మహబూబ్‌నగర్, వికారాబాద్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాల పరిధిలోని 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో శ్రీశైలం బ్యాక్ వాటర్‌పై పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి అంకురార్పణ చేశారు. ఈ క్రమంలో నార్లాపూర్‌లోని మొదటి పంపుహౌజ్ వద్ద 3500క్యూసెక్కుల డిశ్చార్జ్ సామర్థ్యం గల 9మోటార్లను బిగించనున్నారు. ఇందులో ఒక మోటారును స్టాండ్‌బైగా పెడుతారు. ఏదుల, వట్టెం పంపుహౌజ్‌లో ఇంతే సామర్థ్యం గల పది మోటార్లను అమర్చనున్నారు. ఇందులో ఒక్కొక్కటి తాండాబాయ్‌గా ఉండనుంది. ఉద్దండపూర్ పంపుహౌజ్‌లో ఐదు మోటార్లను బిగిస్తారు. ఏదుల నుంచి డిండి నీటి తరలింపు వ్యవహారంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆ పార్టీ సొంత ఎమ్మెల్యేలు వ్యతిరేకించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అర టీఎంసీ నీటిని పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా డిండికి నీటిని తరలించాలని యోచన ప్రభుత్వానికి వచ్చినప్పుడు కొన్ని ప్రజా సంఘాలు అభ్యంతరం చేసిన విషయం తెలిసిందే. గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి ఇదే ప్రశ్న ఎదురైంది. అయితే ఏదుల నుంచి డిండికి తరలించే అర టీఎంసీ నీళ్లు అదనమేనని ఆయన చెప్పడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది.

ఈ విషయంలో 'ఆంధ్రజ్యోతి' పలువురు సాగునీటి శాఖకు చెందిన నిపుణులను సంప్రదించగా టెక్నికల్‌గా నీటి తరలింపు వ్యవహారంపై స్పష్టతనిచ్చారు. నార్లాపూర్ మొదటి పంపుహౌజ్‌లో 8మోటార్లు ఒకటి స్టాండ్‌బై ఉండగా, స్టాండ్‌బై మోటారును కూడా కృష్ణానదికి వరద వచ్చినప్పుడు వినియోగించుకోవాలని నిర్ణయించారు. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం మోటార్లన్నీ కూడా 3500క్యూసెక్కుల డిశ్చార్జ్ సామర్థ్యం కంటే 20 శాతం అధికంగా ఉండటం వల్ల దాదాపు నాలుగు టీఎంసీల నీటిని ఏదుల నుంచి డిండికి తరలించడం అసాధ్యం కాదని నిర్ధయించినట్లు తెలుస్తోంది. ఇదే అంశాన్ని అధికారికంగా కూడా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఇక్కడ ఒక విషయం గమనించాల్సిందేంటంటే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం కింద 12లక్షల 30వేల ఎకరాలకు సాగునీరందాలన్న అర టీఎంసీ చొప్పున ఏదుల నుంచి డిండి వరకు కృష్ణా జలాలను తరలించాలన్నా ఎగువ ప్రాంతంలో వర్షాలు అధికంగా కురిసి కృష్ణానదికి 60రోజులు వరద జలాలు వస్తేనే సాధ్యమవుతుంది. కృష్ణానది జలాల వినియోగం విషయంలో ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్యన బ్రిజేష్ ట్రిబ్యునల్‌లో వాదనలు కొనసాగుతున్న క్రమంలో ఇది ఎంత మేరకు సాధ్యమవుతుందనే అంశంపై వేచి చూడాల్సి ఉంది.

లిక్కర్‌పై 10 శాతం ఎక్కువ.. బీర్లపై 15శాతం తక్కువ



గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో లిక్కర్ అమ్మకాలు 10.03శాతం ఎక్కువగా ఉన్నాయి. బీర్ల వరకు వస్తే 15శాతం తక్కువగా అమ్మకాలు జరిగాయి. కారణం బీర్ల రేటును ప్రభుత్వం పెంచడమే. అంతేకాకుండా పక్క రాష్ట్రం నుంచి మన రాష్ట్రానికి వచ్చి గతంలో మద్యం కొనుగోలు చేసేవారు. ఇప్పుడు అక్కడ రేట్లను తగ్గించడంతో పాటు ఇక్కడి బ్రాండ్లు కూడా ఉండటంతో మద్యం అమ్మకాలు కొద్దిగా తగ్గాయనే చెప్పవచ్చు. మే నెలలో ఈ అమ్మకాలు కొద్దిగా పెరిగే అవకాశాలున్నట్లు కనపడుతుంది.

- గణపతిరెడ్డి, ఎక్సైజ్ సీఐ, గద్వాల

లిక్కర్ జోరు



బీర్ల రేట్లు పెరగడంతో లిక్కర్ అమ్మకం జోరందుకొంది. దీంతో మద్యంప్రియులు తెగ తాగేస్తుండ్రు. జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏటా లిక్కర్ అమ్మకాలు పెరిగాయి. అయితే, ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం బీర్ల ధరలు పెంచడంతో అమ్మకాలు కాస్త తగ్గుముఖం పట్టడం గమనార్హం.

» గద్వాల జిల్లాలో జోరుగా లిక్కర్ అమ్మకాలు
» గత ఏడాది కంటే ఈ ఏడాది విక్రయాలు మరింత మెరుగు
» బీర్ల రేటు పెరగడంతో లిక్కర్ బాటబట్టిన మద్యం ప్రియులు
» ఈ నెలలో లిక్కర్ అమ్మకాలు మరింత పెరిగే అవకాశం
» ఎక్కువ ఆదాయం సమకూరాల్సి ఉండగా రేట్ల పెంపుతో తగ్గుముఖం

గద్వాల క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లాలో మద్యం ప్రియులు లిక్కర్‌ను తెగ తాగేస్తున్నారు. జిల్లాలో రోజు రోజుకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నప్పటికీ బీర్ల రేటును ప్రభుత్వం ఇటీవలే పెంచేసింది. దీంతో మద్యం ప్రియులు బీరును వదిలి లిక్కర్ వైపునకు మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది మార్చి, ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది ఆ రెండు నెలల్లో లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా, బీర్ల అమ్మకాలు తక్కువగా సాగినట్లు తెలుస్తున్నది. ఎండల తీవ్రతతో లిక్కర్‌కు బదులుగా బీర్లనే కొనుగోలు చేయాల్సి ఉండగా, వాటి ధర పెంపుతో లిక్కర్‌ను కొనుగోలు చేస్తున్నారు.

● బీర్ల అమ్మకాలు తక్కువ

జోగుళాంబ గద్వాల జిల్లాలో గత ఏడాది మార్చి, ఏప్రిల్ నెలలను పరిశీలిస్తే.. జిల్లా మొత్తంలో మార్చి నెలలో 28,399 కాటన్ల బీర్లు, లిక్కర్ 20,638 కేసులు అమ్ముడయ్యాయి. ఇందుకు సంబంధించి రూ. 19.77 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది మార్చి నెలలో 22,040 బీర్ల కాటన్లు అమ్మకం జరిగిందని, అలాగే 20,850 కేసుల లిక్కర్ అమ్ముడుపోయిందన్నారు. ఇందుకు సంబంధించి రూ. 19.83 కోట్ల ఆదాయం సమకూరిందన్నారు. అలాగే గత ఏడాది ఏప్రిల్ నెలలో జిల్లాలో 35,395 కాటన్ల బీర్లు, 22,487 కేసుల లిక్కర్ అమ్ముడు పోగా వీటికి సంబంధించి రూ. 22.37 కోట్ల ఆదాయం రాగా, ఈ ఏడాది ఏప్రిల్ నెలలో 30,129 కాటన్ల బీర్లు, 24,803 కేసుల లిక్కర్ విక్రయం జరిగి రూ. 24.20కోట్లు ఆదాయం సమకూరినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

● రేట్ల పెంపుతో తగ్గుముఖం

అయితే గత ఏడాది కంటే ఈ ఏడాది లిక్కర్ అమ్మకాలు ఎక్కువగా ఉన్నప్పటికీ ఇంకా పూర్తి స్థాయిలో ప్రభుత్వానికి ఆదాయం రాలేదు. దీనికి కారణం రేట్ల పెంపుతో తగ్గుముఖం పట్టిందని తెలుస్తున్నది. అంతేకాకుండా గతంలో మన పక్క రాష్ట్రం అయిన ఆంధ్రప్రదేశ్‌లో రేట్లు ఎక్కువగా ఉండేవి. దీంతో పాటు వారి స్వంత బ్రాండ్ మద్యాలను అమ్మకాలు చేస్తుండటంతో వారు తెలంగాణ సరిహద్దు ప్రాంతాలైన అలంపూర్ చౌరస్తా, అలంపూర్‌లో మద్యం కొనుగోలు చేసేవారు. అయిజ నుంచి మద్యం సరఫరా జరుగుతుండేది. అయితే ఇప్పుడు అక్కడ మద్యం రేట్లను తగ్గించడంతో పాటు తెలంగాణలో ఉన్న మద్యం బ్రాండ్‌లనే వారు అమ్మకాలు జరిపిస్తుండటంతో జోగుళాంబ గద్వాల జిల్లాకు అనుకున్నంత మేరలో ప్రభుత్వానికి ఆదాయం సమకూరనట్లు తెలుస్తున్నది.

అమ్మకాలు పెరిగే అవకాశాలు

గత ఏడాదితో పోలీస్తే ఈ ఏడాది ఎండలు ఎక్కువగా ఉన్నాయి. దీంతో లిక్కర్, బీర్‌ల అమ్మకాలు మరింతగా పెరుగుతాయని అధికారులు చెబుతున్నారు. గత ఏడాది కంటే ఈ ఏడాది మే నెలలో లిక్కర్ అమ్మకాలు తారాస్థాయికి చేరుకుంటాయని వైన్స్ దుకాణ యజమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా యువకులు ఈ ఎండాకాలంలో ఎక్కువగా బీర్‌లనే తాగాల్సి ఉండగా రేటు పెంపుతో లిక్కర్ బాటిల్‌ల వాడకం గత కొన్ని రోజుల నుంచి క్రమంగా పుంజుకున్నదని చెబుతున్నారు.



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ రావుల గిరిధర్

పోలీస్ సిబ్బందికి వ్యాయామం తప్పనిసరి

» ఎస్పీ రావుల గిరిధర్

వనపర్తి, మే 2(ఆంధ్రజ్యోతి) : పోలీస్ సిబ్బంది, అధికారులకు ప్రతీ రోజు వ్యాయామం తప్పనిసరి అని ఎస్పీ రావుల గిరిధర్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పోలీస్ అధికారులకు, సిబ్బందికి దృశ్య శ్రవణ మాధ్యమం ద్వారా డాక్టర్ మురళీధర్‌తో ఆరోగ్య సమస్యలు జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఎస్పీ మాట్లాడుతూ... పోలీస్ సిబ్బంది విధి నిర్వహణలో పడి తమ ఆరోగ్యాన్ని సైతం పట్టించుకోరని తెలిపారు. ప్రతీ మూడు నెలలకు ఒకసారి అన్ని రకాల పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ మురళీధర్ మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు తమ ఆరోగ్యాన్ని కాపాడుకున్నప్పుడే కుటుంబాన్ని కూడా కాపాడుకోగలుగుతారని అన్నారు. పోలీసుల దినచర్య ఇతరులకు చాలా భిన్నంగా ఉంటుందని, ఇందుకు గాను ఆరోగ్య పరిరక్షణకై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా 40 సంవత్సరాలు పైబడిన ప్రతీ ఒక్కరు కూడా ఆరు నెలలకు ఒకసారి వైద్యులను సంప్రదించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డీసీఆర్‌బీ డీఎస్పీ ఉమా మహేశ్వర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేశ్, డీసీఆర్‌బీ ఎస్ఐ తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

తెగిపోతున్న పేగు బంధాలు

» జిల్లాలో మాతా శిశు మరణాల కట్టడి చర్యలు శూన్యమేనా?
» ఏడాదిలో 101 శిశు, 7 మాతృ మరణాలు నమోదు
» వైద్య సిబ్బంది పర్యవేక్షణకు ఫలితం లేకుండా పోతుందా?
» కలవరపెడుతున్న శిశు మరణాల సంఖ్య
» పౌష్టికాహార లోపమా? కుటుంబ సభ్యుల నిర్లక్ష్యమా?

వనపర్తి వైద్యవిభాగం, మే 2 (ఆంధ్రజ్యోతి): మాతా శిశు మరణాలను కట్టడి చేయడం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను ప్రవేశపెట్టి, ప్రజలకు అవగాహన కల్పిస్తూ కోట్ల రూపాయలను ఖర్చు పెడుతున్నాయి. ప్రతీ జిల్లాలో మాతా శిశు సంరక్షణ కేంద్రాలను నెలకొల్పి గర్భిణులకు, బాలింతలకు, నవజాత శిశువులకు అవసరమైన వైద్య సేవలను అందిస్తున్నాయి. అయినా జిల్లాలో మాత్రం మాతా శిశు మరణాల సంఖ్య తగ్గకపోవడం కలవరపెడుతున్న అంశం. గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్య కార్యకర్తలు నిత్యం గర్భిణులను పర్యవేక్షిస్తూ.. వారిని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ చెకప్‌లు చేయించడమే కాకుండా, ఏఎన్‌సీ (యాంటి నెంటల్ చెకప్)లు కూడా దగ్గరుండి చేయిస్తున్నారు. అంతేకాకుండా గర్భిణులు సుఖ ప్రసవం జరిగే వరకు, జరిగిన తరువాత కూడా క్షేమంగా ఇంటి నుంచి ఆసుపత్రికి రాకపోకలను సాగించేందుకు 102 వాహన సేవలను సైతం అందుబాటులో ఉంచారు. గత ప్రభుత్వ హయంలో గర్భిణులకు పౌష్టికాహారం అందించే దిశగా న్యూట్రిషన్ కిట్లను అందించి, అమ్మఒడి కార్యక్రమం ద్వారా ఆడపిల్ల పుడితే రూ.13 వేలు, మగపిల్లాడు పుడితే రూ.12 వేలు జమ చేస్తుండేవారు. కానీ ప్రభుత్వం మారడంతో ఆ పథకం కాస్త తాత్కాలికంగా నిలిచిపోయింది. ఇలాంటి అనేక కారణాల్లో సంహారమో లేక గర్భిణులు, వారి కుటుంబ సభ్యుల నిర్లక్ష్యమో జిల్లాలో మాత్రం ఏడాది వ్యవధిలోనే 101 శిశు మరణాలు, 7 మాతృత్వ మరణాలు సంభవించాయి.

● ఫాలో అప్ చర్యలతో కట్టడి చేయలేమా...

గర్భం దాల్చినప్పటి నుంచి స్థానికంగా ఉండే ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు గర్భిణులను నిత్యం పర్యవేక్షిస్తూ ఉంటారు. వారి పూర్తి వివరాలు ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేస్తారు. గర్భిణుల ఆరోగ్య ప్రొఫైల్‌లో బాగంగా రక్తహీనత, అనారోగ్య సమస్యలు, గర్భంలోని పిండం యొక్క ఎదుగుదల వంటి అనేక ఆరోగ్య సూత్రాలను గర్భి ణ ం ల క ం విప



ఏఎన్‌సీ చెకప్ కోసం మాతా శిశు సంరక్షణ కేంద్రానికి వచ్చిన గర్భిణులు (ఫైల్)

రిస్తూ ఎప్పటికప్పుడు ఫాలో అప్ చేస్తూనే ఉంటారు. అయినా కూడా జిల్లా వ్యాప్తంగా మాతా శిశు మరణాల రేటు తగ్గకపోవడం అధికారుల నిర్లక్ష్యాన్ని ప్రశ్నిస్తున్నది. గత నెల ఏప్రిల్ 8న అమరచింత మండలానికి చెందిన నిండు గర్భిణి కాన్పు కోసం పురిటి నొప్పులతో ఆసుపత్రికి వెళితే కడుపులోనే శిశువు మృతి చెందింది. శిశువు శరీరభాగాలు సగం బయటికి వచ్చి మిగతా సగం రాకపోవడంతో తల్లిని కాపాడేందుకు వైద్యులు శిశువును తల, మొండెం వేరు చేశారు. ఇలాంటి సంఘటనలు ఎందుకు చోటు చేసుకుంటున్నాయి? వాటి కట్టడి కోసం ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే కోణంలో జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష కూడా నిర్వహించారు.

చివరి నిమిషంలో రావడం వల్లే..

బతుకుదెరువు కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు చివరి నిమిషంలో కాన్పు కోసం స్వంత గ్రామాలకు రావడం వల్ల శిశు మరణాలు సంభవిస్తున్నాయి. ఇతర ప్రాంతాల్లో ఉండటం వల్ల సరైన గర్భిణులపై ఆరోగ్య కార్యకర్తల పర్యవేక్షణ ఉండటం ఇబ్బందిగా మారుతున్నది. అయినప్పటికీ చాలా వరకు ఆరోగ్య కార్యకర్తలతో అవగాహన కల్పిస్తూ.. పౌష్టికాహార విలువలను వివరిస్తూ.. మాతా శిశు మరణాలను కట్టడి చేస్తున్నాం. ఈ ఏడాది మరణాల సంఖ్యను తగ్గుముఖం పట్టించాం.

- శ్రీనివాసులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి

● మరణాల సంఖ్య ఇలా...

గత ఏడాది ఏప్రిల్ నుంచి ఈ మార్చి వరకు శిశు మరణాల సంఖ్య జిల్లాలో ఇలా నమోదు అయ్యాయి. అప్పరాల-9, గాంధీనగర్-4, మనపూర్- 4, గోపాల్‌పేట-21, కడుకుంట్ల-6, కొత్తకోట-2, మదనాపురం-11, పాన్‌గల్-3, పెబ్బేరు-5, పెద్దమందడి-9, పీపీ యూనిట్-1, శ్రీరంగాపూరం-3, తిప్పడంపల్లి-13, వీర్లగుట్ట-3, వీపనగండ్ల-7 మంది మరణాలతో జిల్లా వ్యాప్తంగా 101 శిశు మరణాలు సంభవించాయి. మాతృత్వ మరణాలు కడుకుంట్ల-1, వీపనగండ్ల-2, వీర్లగుట్ల- 1, పాన్‌గల్-1, గోపాల్‌పేట-1, పెబ్బేరు-1 చొప్పున జరిగాయి.

7

కొడుకు దిద్దిన కాపురం

» కుటుంబానికి అండగా 'యువరాజు'
» 4 గేదెలతో డెయిరీ ఫామ్ ప్రారంభం
» నేడు 46 గేదెలు, 250 లీటర్ల పాలు
» ఖర్చులు పోను ప్రతీ నెల రూ. లక్ష ఆదాయం



బోరునీటితో గేదెలను కడుగుతున్న రైతు (ఫైల్)

పలుచోట్ల అగ్ని ప్రమాదాలు

» ప్రాగటూరులో అర్ధరాత్రి మంటలు
» 18 గడ్డి వాములు దగ్ధం
» కాలిపోయిన ఎద్దులబండ్లు, ఆయిల్ ఇంజన్లు
» రూ.25 లక్షల ఆస్తి నష్టం

6



ప్రాగటూరులో కాలిపోతున్న గడ్డివాములు

నిత్యం దైవనామస్మరణ

- ఉడిపి ఆదమూరు మఠాధీశుడు విశ్వప్రియ తీర్థ స్వామీజీ
- కొనసాగుతున్న నరసాచలం స్వర్ణోత్సవాలు



స్వామీజీకి పాదపూజ అనంతరం సత్కరిస్తున్న సీతారామరావు దంపతులు



మూల రాముల పూజ నిర్వహిస్తున్న విశ్వప్రియ తీర్థ స్వామీజీ

నారాయణపేటరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నిత్యం దైవ నామ స్మరణతో కష్టాలు దూరం అవుతాయని ఉడిపి ఆదమూరు మఠాధీశుడు విశ్వప్రియ తీర్థ స్వామీజీ అన్నారు. నారాయణపేట జిల్లా, నారాయణపేట మండలంలోని కోటకొండ నరసాచలంలో స్వర్ణోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఐదవ రోజు శుక్రవారం భూవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామీజీ ఆధ్వర్యంలో మూల రాముల సంస్థాన పూజ నిర్వహించారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. ప్రతీ ఒక్కరు దైనందిన కార్యక్రమాలతో పాటు ఆధ్యాత్మిక చింతనకు ప్రతీ రోజు కొంత సమయం కేటాయించాలన్నారు. ధర్మాన్ని రక్షిస్తే అది మనలను రక్షిస్తుందన్నారు. భాగవత సప్తాహంలో భాగంగా హైదరాబాద్ ఉత్తరాది మఠానికి చెందిన విద్వాన్ తుప్పసక్కిరి ప్రహ్లాదాచార్యులు ఆరవ స్కంద పారాయణం చేశారు. అంతకు ముందు నరసాచల సేవాసమితి సభ్యులు సీతారామరావు దంపతులు, కుటుంబ సభ్యులు స్వామి వారికి పాదపూజ చేసి, ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోవిందతీర్థ స్వాములు, నరసాచల సేవాసమితి సభ్యులు జనార్దన్‌రావు, ప్రభంజన్‌రావు, జయతీర్థాచారి, శ్రీనివాస్, భరత్, హన్మేశ్, ప్రకాశ్, శేషు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

- రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ లక్ష్మణ్



గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

తిమ్మాజీపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రాష్ట్ర పర్యవేక్షణ అధికారి డాక్టర్ లక్ష్మణ్ రైతులకు సూచించారు. పశుగణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా, తిమ్మాజిపేట మండలంలోని సూర్య నాయక్‌తండా, గుమ్మకొండ, ఆవంచ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన పశువైద్య శిబిరాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట నాగర్‌కర్నూల్ జిల్లా పశువైద్య సంవర్ధక శాఖ అధికారి జ్ఞానశేఖర్ ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు చేస్తూ మాట్లాడారు. వైరస్‌తో పశువులకు గాలికుంట వ్యాధి సోకుతుందని తెలిపారు. గాలి ద్వారా ఒక పశువు నుంచి మరొక పశువుకు త్వరగా వ్యాధి సోకే అవకాశాలున్నాయని చెప్పారు. పశువైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు. 345 తెల్లజాతి, 251 నల్లజాతి పశువులకు టీకాలు వసినట్లు పశువైద్యాధికారి ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రావణి, సిబ్బంది తిరుపతయ్య, విజయలలిత, యాదగిరి, శాంతయ్య, రవి, అమీర్, గోపాలమిత్రలు స్వామి, జగ్జీవన్ పాల్గొన్నారు. అంతకు ముందు డాక్టర్ లక్ష్మణ్ అధికారులు, సిబ్బందితో కలిసి ఆవంచలోని ఐశ్వర్య గణపతిని దర్శించుకొని పూజలు చేశారు.

కౌన్సిలర్‌పై కేసు నమోదు

జడ్చర్ల, మే 2 (ఆంధ్రజ్యోతి) : కిడ్నాప్ ఆపై దాడికి పాల్పడ్డాడంటూ వచ్చిన ఫిర్యాదుపై జడ్చర్ల మునిసిపాలిటీలోని ఓ కౌన్సిలర్‌పై కేసు నమోదైంది. విశ్వసనీయ సమాచారం మేరకు.. జాతీయ రహదారిపై ఉన్న ఓ ప్రార్థనా మందిరం వద్ద వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వ్యక్తిని కౌన్సిలర్‌తో పాటు మరో వ్యక్తి గురువారం కిడ్నాప్ చేసి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో గాయపడిన సదరు వాచ్‌మెన్ శుక్రవారం జడ్చర్ల పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



బాదేపల్లి మార్కెట్‌లో వర్షానికి తడవకుండా తాడ్పాలు కప్పిన రైతులు





వనపర్తి జిల్లా ఘణపురం మండలం సోలిపూర్ గ్రామంలో కురుస్తున్న వర్షంలో తడిసిన వడ్లను చూపిస్తున్న రైతు వెంకటేశ్వర్ రెడ్డి

వేధిస్తున్న అకాల వర్షం

- మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో నష్టం
- కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం
- అక్కడక్కడా వడగండ్ల వాన

మహబూబ్‌నగర్ టౌన్/ జడ్చర్ల/ భూత్పూర్/ ఖిల్లాఘణపురం, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను అకాల వర్షం వదలిపెట్టడం లేదు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటోంది. ఆ తర్వాత వాతావరణం మేఘావృతమై వర్షం పడుతోంది. అలాగే శుక్రవారం మహబూబ్‌నగర్, వనపర్తి జిల్లాల్లో కొన్ని చోట్ల ఓ మోస్తరు, భారీ వర్షాలు కురవగా, మరి కొన్ని చోట్ల ఈదురుగాలులతో వర్షం కురిసి, వడగండ్లు పడ్డాయి. మహబూబ్‌నగర్ పట్టణంలో ఓ మోస్తరు వర్షంతో వడగండ్ల వర్షం పడింది. చిన్న పిల్లలు వడగండ్లను పట్టుకొని సరదాగా ఆడుకున్నారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, బాదేపల్లి మార్కెట్ యార్డుకు రైతులు 11 వేల క్వింటాళ్ల ధాన్యం, మొక్కజొన్న విక్రయానికి తీసుకువచ్చారు. శుక్రవారం సాయంత్రం కురిసిన వర్షానికి ధాన్యం కొంత మేర తడిసిపోయింది. అలాగే పత్తి మార్కెట్‌లో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రైతులు తెచ్చిన ధాన్యం కొంతమేర తడిసిపోయింది.

● మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలో శుక్రవారం సాయంత్రం అతి భారీ వర్షం కురిసింది. మండలంలోని వెల్కిచర్ల, పాతమొల్గర, భూత్పూర్, హస్నాపూర్, కప్పెట, కర్వెన, మద్దిగట్ల, పోతులమడుగు, రావులపల్లి, తాటిపర్తి, తాటికొండ, అన్నాసాగర్, మొత్తం 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయానికి తెచ్చి ఆరబెట్టుకున్న ధాన్యం తడిసి ముద్దయ్యింది. మొత్తం 100 మెట్రిక్ టన్నులకు పైగా ధాన్యం తడిసిపోయి ఉంటుందని రైతులు చెప్తున్నారు. అలాగే కోతకు సిద్ధంగా ఉన్న వరి పైర్లు దెబ్బతిన్నాయని అంటున్నారు.

● వనపర్తి జిల్లా, ఖిల్లాఘణపురం మండల కేంద్రం పరిసర గ్రామాలతో పాటు సోలీపూర్‌లో ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులతో వడగండ్ల వర్షం కురవడంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయింది. సోలీపూర్ గ్రామంలో రైతు కల్వకోల్ వెంకటేశ్వర్ రెడ్డి వరి పంటను కోసి కుప్పగా పోసిన వెంటనే వడగళ్ల వాన కురవడంతో ధాన్యం కొట్టుకుపోయింది. దొంతికుంట తండాకు చెందిన గోపాల్‌నాయక్ రోడ్డుపై ఆరబోసిన ధాన్యం వర్షానికి కొట్టుకుపోయింది. మండల కేంద్రంలో రైతు అక్కారి శేషయ్యకు చెందిన ధాన్యం పూర్తిగా తడిసిపోయింది. అప్పారెడ్డిపల్లి గ్రామంలో కూడా వడగళ్ల వాన పడడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు ఇబ్బంది పడ్డారు.

● శ్రీరంగాపురం మండల పరిధిలోని కంచిరావుపల్లి, కంబాలాపూర్ రహదారిలో ఈదురు గాలులకు చెట్లు విరిగి పడటంతో రాకపోకలకు వాహనదారులు ఇబ్బంది పడ్డారు.



భూత్పూర్ చౌరస్తాలో భారీ వర్షానికి నాలలో కొట్టుకోపోతున్న ద్విచక్రవానం



మహబూబ్‌నగర్ పట్టణంలో పడిన వడగండ్లు



కంబాలపురం, కంచిరావుపల్లి మధ్య రహదారిపై విరిగినపడిన చెట్లు



భూత్పూర్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం



వనపర్తి జిల్లా ఘణపురం మండలం దోతికుంట తండా వెళ్లే దారిలో కురుస్తున్న వర్షానికి తడిసిన వడ్లపై కవర్ కప్పుతున్న రైతులు



వనపర్తి జిల్లా ఘణపురం మండలం దొంతికుంట తండా వెళ్లే దారిలో కురుస్తున్న వర్షానికి తడిసిన వడ్లను చూపిస్తున్న రైతు గోపాల్ నాయక్

భక్తిశ్రద్ధలతో కుంకుమార్చనలు

- కొనసాగుతున్న బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు
- జనంతో కళకళలాడుతున్న అచ్చంపేట పట్టణం
- పెరిగిన రాగి బిందెలు, గుమ్మడికాయల విక్రయాలు



విగ్రహ యంత్రాలకు సామూహిక కుంకుమార్చనలు చేసిన మహిళలు పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి

అచ్చంపేట, మే 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ జిల్లా, అచ్చంపేట పట్టణంలో బొడ్రాయి, పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. అందులో భాగంగా మూడవ రోజు శుక్రవారం యాగశాలలో గోపూజ, ప్రధాన ప్రతిష్ఠ ఉత్సవాల దీక్షా రక్షా బంధన కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమార్చన చేశారు. సాయంత్రం నూతన విగ్రహాలకు ధాన్యాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో గుమ్మడి కాయలు, రాగి బిందెల విక్రయాలు జోరందుకున్నాయి. వివాహం, ఉద్యోగాలు, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన స్థానికులు, ఆడపడుచులు ఉత్సవాల్లో పాల్గొనేందుకు అచ్చంపేటకు తరలిరావడంతో పట్టణం జనంతో కళకళలాడుతోంది. గ్రామ దేవతల ఆలయాలతో పాటు కోనేరు, ప్రధాన వీధులను విద్యుత్ దీపాలతో అలంకరించారు.



హోమాలు నిర్వహిస్తున్న భక్తులు

హిందూ ధర్మ ప్రాణదాత జగద్గురు ఆది శంకరులు



జగద్గురు ఆది శంకరచార్యుల ఉత్సవ మూర్తికి పూజలు చేస్తున్న సేవా సమితి సభ్యులు

నారాయణపేట న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జగద్గురు ఆదిశంకరచార్యుల జయంతి పురస్కరించుకొని పేట పట్టణంలోని శంకర సేవా సమితి ఆధ్వర్యంలో జయంతి మహోత్సవాలను దేవ్‌జీ నివాసంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తికి మహా పంచామృతాభిషేకం, సామూహిక కుంకుమార్చన, ప్రతేక పూజలను నిర్వహించారు. అనంతరం శ్రీశారద భజన మండలి ఆధ్వర్యంలో మహిళలచే సామూహిక లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకుడు డాక్టర్ స్వామి శాంతానంద పురోహిత్ శంకరచార్యుల విజయగాథను వివరించారు. కార్యక్రమంలో ధరణిధర్ దీక్షిత్, విద్యాధర్ దీక్షిత్, ధీరజ్ దీక్షిత్, ఊట్కూర్ శివానంద పురోహిత్, విభావసు పురోహిత్, అర్చకులు వేణుగోపాల్‌చార్యులు, పద్మావతి, రాజేశ్వరి, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

పేట రాఘవేంద్రస్వామి ఆలయాన్ని సందర్శించిన ఉడిపి స్వామిజీ



ఉడిపి స్వామికి జ్ఞాపికను అందిస్తున్న రాఘవేంద్ర సేవా సమితి సభ్యులు

నారాయణపేట న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట పట్టణంలోని పరిమాళపురంలో వెలసిన రాఘవేంద్ర స్వామి ఆలయాన్ని శుక్రవారం ఉడిపి అదమురు మఠాధితులు విశ్వప్రియతీర్థులు సందర్శించారు. ఆలయానికి వచ్చిన స్వామిజీకి విద్వాన్ అనిల్‌దేశాయి, ఆలయ అర్చకులు నర్సింహాచారి, శేషు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో హారతినిచ్చి భక్తులనుద్దేశించి ఆధ్యాత్మిక ప్రచవనం చేశారు. కార్యక్రమంలో రాఘవేంద్ర స్వామి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

గొర్రెల దొంగల అరెస్టు



గొర్రెల దొంగల వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాంబాబు

కొత్తకోట, మే 2 (ఆంధ్రజ్యోతి) : మందల్లోంచి గొర్రెలను ఎత్తుకెళ్తున్న ఇద్దరు దొంగలను అరెస్టు చేసినట్లు సీఐ రాంబాబు తెలిపారు. వనపర్తి జిల్లా, కొత్తకోట మండల కేంద్రంలో శుక్ర వారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గత నెల 25న కొత్తకోట మండలంలోని అమడబాకుల శివారులో రాయనిపేట గ్రామానికి చెందిన బాలరాజు గొర్రెల మందను ఆపాడు. అదే రోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి 33 గొర్రెలను డీసీఎంలోకి ఎక్కించారు. అలికిడి విని బాలరాజు కేకలు వేయడంతో డీసీఎం సహా పరారయ్యారు. ఈ విషయాన్ని అదే రాత్రి కుటుంబ సభ్యులకు చెప్పి పోలీసులకు ఫిర్యాదు చేయించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా దేవనకొండ మండలంలోని గుమ్మిరాల గ్రామానికి చెందిన రామనాయుడు, బక్కదిన్నె గ్రామానికి చెందిన ఉప్పర రామాంజనేయులను పెబ్బేర్ సంతలో అదుపులోకి తీసుకొని విచారించారు. దొంగతనం చేసింది తామేనని, తమతో పాటు మరో నలుగురు ఉన్నారని వారు చెప్పారు. దీంతో వారిద్దరినీ అరెస్ట్ చేసి, శుక్రవారం జిల్లా కోర్టులో హాజరు పరిచారు. న్యాయాధికారి ఉత్తర్వుల మేరకు రిమాండ్‌కు తరలించారు.



మంటలలో పూర్తిగా దెబ్బతిన్న రైతు ట్రాక్టర్



యాదిరెడ్డిపల్లిలో ప్రమాదవశాత్తు అంటుకుపోతున్న గడ్డిని ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది



షార్ట్ సర్క్యూట్‌తో కేటీదొడ్డిలో కాలిపోయిన వస్త్ర దుకాణం, అందులోని సామగ్రి

పలుచోట్ల అగ్ని ప్రమాదాలు

- ప్రాగటూరులో అర్ధరాత్రి మంటలు
- 18 గడ్డి వాములు దగ్ధం
- కాలిపోయిన ఎద్దులబండ్లు, అయిల్ ఇంజన్లు
- రూ.25 లక్షల ఆస్తి నష్టం

ఉండవల్లి/ తాడూరు/ నాగర్‌కర్నూల్ క్రైం/ కేటీదొడ్డి/ అలంపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం అర్ధరాత్రి, శుక్రవారం పలుచోట్ల అగ్నిప్రమాదాలు సంభవించాయి. జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవల్లి మండలం ప్రాగటూరు గ్రామంలో వరి కోతల అనంతరం రైతులు కల్లాల్లో గడ్డి వాములు నిల్వ చేశారు. వాటితో ఎద్దుల బండ్లను కూడా పొలాల్లోనే ఉంచారు. గురువారం అర్ధరాత్రి తర్వాత వాటికి మంటలు అంటుకున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున రైతులు పొలానికి వెళ్లి చూడగా 18 గడ్డివాములు, ఎద్దులబండ్లు, మోటార్లు ఆయిల్ ఇంజన్లతో పాటు వందకు పైగా పైపులు మంటల్లో కాలిపోతూ కనిపించాయి. ఇది సహజ ప్రమాదం కాదని, గుర్తు తెలియని వ్యక్తుల దుశ్చర్య అని గ్రామస్థులు చెప్తున్నారు. పశువుల మేతకు గడ్డిపోచ కూడా మిగల్లేదని రైతులు బోరున విలపించారు. సంఘటనలో దాదాపు రూ.25 లక్షలకు పైగా ఆస్తి నష్టం సంభవించిందని తెలిపారు. గ్రామస్థులు, రైతుల సమాచారం మేరకు శుక్రవారం ఉదయం ఉండవల్లి తహసీల్దార్, ప్రభాకర్, ఆర్ఐ, సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. రెండు ఫైర్ ఇంజన్లతో మంటలను అదుపులోకి తెచ్చారు. రైతులతో మాట్లాడి పూర్తి వివరాలు సేకరించారు. ప్రమాదానికి కారణాలను తెలుసుకుని బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు బోయ హుసేన్, బోయ లవన్న, బోయ జయన్న, బోయ లక్ష్మన్న, తెలుగు మధు, షావలి, నజీర్, గొల్ల మద్దిలేటి, లక్ష్మన్న, నవీన్ అధికారులను కోరారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

యాదిరెడ్డిపల్లిలో మరో గడ్డివామి

నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం, యాదిరెడ్డిపల్లి గ్రామంలో బాలకిష్టయ్య అనే రైతుకు చెందిన గడ్డివామికి శుక్రవారం మంటలంటుకున్నాయి. గమనించిన రైతు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు వచ్చి మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే గడ్డితో పాటు, వంట చెరుకు కూడా కాలిబూడిదయ్యింది. దీంతో దాదాపు లక్ష రూపాయల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

కుమ్మెరలో మొక్కజొన్న పంట...

నాగర్‌కర్నూల్ జిల్లా, అదే మండలంలోని కుమ్మెర గ్రామానికి చెందిన రైతు పానుగంటి కిష్టయ్య పొలంలో మొక్కజొన్న చేను కోత కోసి పొలంలో అక్కడక్కడ బొడ్డెలు వేశాడు. పక్క పొలం వారు చెత్తను కాలుస్తుండగా, ప్రమాదవశాత్తు మొక్కజొన్న చేనుకు మంటలు అంటుకున్నాయి. దాంతో పాటు వ్యవసాయ పరికరాలు, స్ప్రింక్లర్లు, వాటర్ సప్లయ్ పైపులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో దాదాపు రూ. 4 లక్షల నష్టం వాటిల్లినట్లు రైతు తెలిపారు.

వరిగడ్డి ట్రాక్టర్..

జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మండల పరిధిలోని లింగనవాయి గ్రామంలో వరిగడ్డి లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు వెంకట్రాముడు అమరచింత ఆత్మకూరు నుంచి ట్రాక్టర్‌లో పశుగ్రాసాన్ని తీసుకొస్తున్నాడు. గ్రామంలోని ప్రధాన వీధిలో కిందకు వేలాడుతూ ఉన్న విద్యుత్ తీగలు గడ్డికి తగిలి మంటలు చెలరేగాయి. దీంతో పశుగ్రాసంతో సహా ట్రాక్టర్ కాలిపోయింది.

మంటలను గమనించిన డ్రైవర్ వెంటనే కిందకు దిగిపోవడంతో ప్రాణాపాయం తప్పింది. దాదాపు రూ. 10 లక్షల నష్టం వాటిల్లిందని రైతు వెంకట్రాముడు తెలిపారు. ప్రమాదానికి విద్యుత్ శాఖ అధికారులు బాధ్యత వహించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జీకే ఈదన్న డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని కోరారు.

కేటీదొడ్డిలో వస్త్ర దుకాణం...

జోగుళాంబ గద్వాల జిల్లా, కేటీదొడ్డి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం సమీపంలో అబేదాబేగం అనే మహిళ వస్త్రదుకాణం నిర్వహిస్తోంది. చెప్పుల దుకాణం, లేడీస్ కార్నర్‌ను కూడా నిర్వహిస్తోంది. పక్కనే ఉన్న దుకాణంలో హోటల్‌ను నడుపుతోంది. ఆబేదాబేగం కుమార్తె వివాహం శుక్రవారం గద్వాలలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరుగుతుండటంతో వారి కుటుంబ సభ్యులందరూ అక్కడే ఉన్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి దుకాణంలో నుంచి దట్టమైన పొగలు వచ్చాయి. చుట్టుపక్కల వారు గమనించి నీరు చల్లి మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. స్థానికుల సమాచారం మేరకు కుటుంబ సభ్యులు, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పేందుకు యత్నించారు. కానీ అప్పటికే దుకాణంలోని వస్త్రాలు, చెప్పులు, లేడీస్ కార్నర్, హోటళ్లకు సంబంధించిన సామగ్రితో పాటు, శుభకార్యం తెచ్చిన దుస్తులు, బీరువాలు, ఫ్రిడ్జ్, ఫ్యాన్‌లు సహా, దుకాణంలోని రూ.2 లక్షల నగదు కాలి బూడిదయ్యాయి.

క్రైం కార్నర్

స్కూటీ అదుపు తప్పి వ్యక్తి మృతి

» మరొకరికి తీవ్ర గాయాలు


గాలెటి ప్రభాకర్ (ఫైల్)

బల్మూరు, మే 2 (ఆంధ్రజ్యోతి) : ప్రమాదవశాత్తు స్కూటీ అదుపు తప్పి కింద పడటంతో ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. బల్మూరు ఎస్ఐ రమాదేవి తెలిపిన వివరాల ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా, బల్మూరు మండల కేంద్రానికి చెందిన గాలెటి ప్రభాకర్(40), సత్యనారాయణ శుక్రవారం మధ్యాహ్నం స్కూటీపై అచ్చంపేటకు వెళ్లారు. తిరిగి వస్తుండగా మైలారం గేటు సమీపంలో క్లచ్ వైర్ తెగి స్కూటీ ముందు చక్రానికి చుట్టుకోవడంతో అదుపుతప్పి కిందపడిపోయారు. ప్రమాదంలో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సత్యనారాయణను 108 అంబులెన్సులో అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రభాకర్ తమ్ముడు సంతోష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతిడికి భార్య సరస్వతి, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నట్లు చెప్పారు.

ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య

అమరచింత, మే 2(ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనపై ఎస్ఐ సురేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వనపర్తి జిల్లా, అమరచింత మండలంలోని నందిమల్ల గ్రామానికి చెందిన పద్మమ్మ (32) భర్త గతంలో మృతి చెందాడు. దీంతో ఆమె బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వెళ్లింది. అక్కడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, కర్నూల్ జిల్లా, ఆదోనికి చెందిన వీరేశంతో పరిచయం ఏర్పడింది. అతడి భార్య అంతకు ముందే మృతి చెందడంతో వీరిద్దరూ పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత నందిమల్లకు చేరుకొని స్థిరపడ్డారు. వారికి ఐదేళ్ల బాబు ఉన్నాడు. కొన్నాళ్ల క్రితం గ్రామంలోనే ప్లాటు కొని రేకుల షెడ్డు వేసుకున్నారు. అందుకోసం అప్పు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. ఈ విషయంపై ఇద్దరి మధ్య తరుచ గొడవలు జరుగుతుండటంతో పద్మమ్మ మనస్తాపానికి గురయ్యింది. గురవారం అర్ధరాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషయంపై సమాచారం అందడంతో పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సురేశ్, హెడ్‌కానిస్టేబుల్ రాములు తెలిపారు.

చెరువులో పడి వివాహిత...

తెలకపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, తెలకపల్లి మండల పరిధిలోని అనంతసాగర్‌లో చెరువులో పడి ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్నది. సంఘటనకు సంబంధించి ఎస్ఐ బి.నరేశ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతసాగర్ గ్రామానికి చెందిన కనుకు కృష్ణవేణి (35) భర్త కృష్ణయ్యతో గొడవ పడి గురువారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. దీంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతుకుతుండగా చేపల చెరువు తూము వద్ద ఆమె చెప్పులు కనిపిం చాయి. అనుమానంతో చెరువులో గాలించగా ఆమె మృతదేహం లభ్యమైంది. సంఘటనపై ఆమె తల్లి కాశమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

గద్వాల క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో ఓ గుర్తు తెలియని వృద్ధురాలు (55) రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఆశోక్ తెలిపారు. గత కొంతకాలంగా ఒంటరిగా జీవిస్తున్న వృద్ధురాలు రైల్వేస్టేషన్ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం గడుపుతోంది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆమె శుక్రవారం ఉదయం రైల్వేస్టేషన్ ప్రధానద్వారం ముందు మృతి చెందింది. ఆమె కుడి చేతిపై ఈర్లదిన్నె ఆశమ్మ అనే పచ్చబొట్టు ఉంది. ఎవరికైనా వివరాలు తెలిస్తే తమను సంప్రదించాలని రైల్వే పోలీసులు కోరారు.

వాహనం ఢీకొని వ్యక్తి...

గద్వాల, మే 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని అనంతపురం శివారులో గురువారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు వివరాలు ఇలా ఉన్నాయి. మేలచెరువు గ్రామానికి చెందిన క్రిస్టోఫర్ (42) ద్విచక్రవాహనంపై ఎర్రవల్లి నుంచి గద్వాల వైపు వస్తుండగా అనంతపురం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అతడిని గద్వాల జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల సమయంలో మృతి చెందాడు. ఈ మేరకు కుటుంబ సభ్యులు శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మృతుడికి భార్య బుచ్చమ్మ, పిల్లలు ఉన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత


టాస్క్‌ఫోర్సు అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

కొత్తపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. కొత్తపల్లి ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండల పరిధిలోని భూనీడ్ వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వాటి యజమానులు మల్లప్ప, కేశవులు, కృష్ణప్పలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అత్యాచారం కేసులో దోషికి పదేళ్ల జైలు

» రూ. 10 వేల జరిమానా

భూత్పూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : బాలికకు మాయమాటలు చెప్పి, అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి న్యాయాధికారి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ శుక్రవారం తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లా, భూత్పూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బొటికె యాదయ్య అనే వ్యక్తి 2018లో అదే గ్రామానికి చెందిన బాలికకు మాయమాటలు చెప్పి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో అత్యాచారానికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి, కోర్టులో చార్జిషీట్ వేశారు. అతడిపై నేరం రుజువు కావడంతో 10 సంవత్సరాల జైలు శిక్ష, రూ. 10 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ స్పెషల్ కోర్టు న్యాయాధికారి రాజరాజేశ్వరి తీర్పు వెల్లడించినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

అలంపూరు చౌరస్తా, మే 2 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూరు మండల పరిధిలోని ర్యాలంపాడు గ్రామంలో వ్యక్తిపై మరో వ్యక్తి కత్తితో దాడి చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఖాసీం, పరశురాముడుల మధ్య కొన్నాళ్లుగా మనస్పర్థలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సాయంత్రం పరశురాముడు ఖాసీం ఇంటి సమీపంలో తిరుగుతుండగా ఇద్దరి మధ్య ఘర్షణ చెలరేగింది. పరశురాముడు కత్తితో దాడి చేయడంతో ఖాసీం గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటస్వామి తెలిపారు. వివాహేతర సంబంధమే ఘర్షణకు కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు.

కొడుకు దిద్దిన కాపురం


డెయిరీ ఫామ్‌లోని ముర్రాజాతి గేదెలు

» కుటుంబానికి అండగా 'యువరాజు'

» 4 గేదెలతో డెయిరీ ఫామ్ ప్రారంభం

» నేడు 46 గేదెలు, 250 లీటర్ల పాలు

» ఖర్చులు పోను ప్రతీ నెల రూ. లక్ష ఆదాయం

అయిజ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : రెక్కాడితే కానీ డొక్కాడని పేద కుటుంబం వారిది. వారసత్వంగా వచ్చిన ఒక ఎకరం పొలాన్ని సాగు చేసుకుంటూ వచ్చే డబ్బుతో నలుగురు సంతానాన్ని పోషించడం ఆ దంపతులకు కష్టంగా మారింది. ఈ పరిస్థితిని మార్చాలనుకున్న వారి చిన్న కుమారుడు యువరాజు కష్టపడి చదువుకొని ప్రభుత్వ ఉద్యోగం తెచ్చుకున్నాడు. అక్కడితో ఆగిపోకుండా కుటుంబానికి ఆదాయం కోసం డెయిరీ ఫామ్ ఏర్పాటు చేశాడు. 4 గేదెలతో ప్రారంభించిన ఆ డెయిరీలో ఇప్పుడు 46 గేదెలు ఉన్నాయి. దీంతో పాటు 44 ఎకరాల భూమిని కౌలుకు తీసుకొని సేంద్రీయ వ్యవసాయం చేస్తున్నాడు. పశుగ్రాసంతో పాటు ఇతర పంటలనూ సాగు చేస్తున్నాడు. ఆ యువరాజు విజయ ప్రస్థానంపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

కష్టాలను అధిగమించి..

అయిజ మండలం, ఉత్తనూరు గ్రామానికి చెందిన దానమ్మ, ఉత్తనూరయ్య దంపతులకు నలుగురు సంతానం. అడబిడ్డను ఉన్నదాంట్లోనే పెళ్లి చేసి అత్తగారింటికి పంపించారు. పెద్ద కుమారుడు లక్ష్మన్నను 10వ తరగతి వరకు చదివించారు. ఆర్థిక పరిస్థితి సహకరించక పై చదువులకు పంపించలేకపోయారు. రెండవ కుమారుడు రాజును తమతో పాటూ పనికి తీసుకెళ్తుండేవారు. చిన్న కుమారుడు యువరాజును కూడా పదవ తరగతి వరకు చదివించారు. మళ్లీ ఆర్థిక సమస్యే ఎదురయ్యింది. కానీ అతడికి అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులో ఉచిత సీటు రావడంతో ఊపిరి పీల్చుకున్న ఆ తండ్రి పై చదువులకు పంపించాడు. 2013 లో డిప్లొమా పూర్తి చేసిన తర్వాత అగ్రి బీఎస్సీలో చేరేందుకు డబ్బు లేక యువరాజు ఇంటి వద్దనే ఉండిపోవాల్సి వచ్చింది. కానీ అతడి మనసు అంగీకరించలేదు. పరిస్థితులకు తలొగ్గితే ఎదుగుదల ఉండదనుకున్నాడు. జీవితంలో ఏదైనా సాధించాలని అనుకున్నాడు. తెలిసిన వారివద్ద కొంత నగదును అప్పుగా తీసుకుని 2015లో యువరాజు వరంగల్‌కు చేరాడు. పోటీ పరీక్షల కోసం శిక్షణ తీసుకున్నాడు. శ్రద్ధగా చదువుకొని 2017లో వ్యవసాయ శాఖలో ఏఈవోగా ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాడు. అంతకు ముందే ఇద్దరు అన్నలకు వివాహం కాగా, ఉద్యోగం వచ్చిన తర్వాత యువరాజు కూడా పెళ్లి చేసుకున్నాడు. అతడిది చిన్న ఉద్యోగం కావడంతో వారి ఉమ్మడి కుటుంబానికి కష్టాలు తప్పలేదు.


మిషన్‌తో కటింగ్ చేసిన పచ్చిగడ్డి


గేదెల పేడ, మూత్రం నిల్వ ఉంచేందుకు తవ్విన గుంత


ఆయిల్‌ఫామ్ కేక్ దాణా

రూ. 8 లక్షలు అప్పు చేసి...

అమ్మ, నాన్న, తన కుటుంబంతో పాటూ, ఇద్దరు అన్నల కుటుంబాలను పోషించడం యువరాజుకు కష్టతరంగా మారింది. ఉద్యోగం వచ్చిన తరువాత మూడేళ్లు ఎలాగోలా జీవనాన్ని నెట్టుకొచ్చినా, ఇక ఏదో ఒక పని కల్పించుకొని ఆర్థికంగా ఎదుగకపోతే పరిస్థితి మారదని గ్రహించాడు. 2020లో రూ. 8 లక్షలు అప్పు చేసి తమ ఎకరం పొలంలో 4 ముర్రాజాతి గేదెలతో కుటుంబ సభ్యులతో డెయిరీ ఫామ్ ఏర్పాటు చేయించాడు. వాటి ద్వారా ప్రతీ రోజు 30 లీటర్ల పాల దిగుబడి వచ్చేంది. తద్వారా వచ్చే డబ్బును జాగ్రత్తగా వాడుకుంటూ డెయిరీ ఫామ్‌ను విస్తరించారు. ప్రస్తుతం వారి డెయిరీలో 46 ముర్రాజాతి గేదెలున్నాయి. రోజుకు 250 లీటర్ల పాలు దిగుబడి అవుతున్నాయి. ప్రతీ నెల రూ.4.50 లక్షల రాబడి వస్తోంది. నిర్వహణకు రూ. 3.50 లక్షలు పోను ప్రతీ నెల లక్ష రూపాయల ఆదాయం వస్తోంది.



గేదె ఖరీదు రూ.1.80 లక్షలు

యువరాజు కుటుంబం నిర్వహిస్తున్న డెయిరీ ఫామ్‌లో ఒక్కో గేదె ఖరీదు రూ. 1.30 లక్షల నుంచి రూ.1.80 లక్షల వరకు ఉంటుంది. హర్యానా రాష్ట్రంలో జింద్ అనే ప్రాంతం నుంచి వీటిని కొనుగోలు చేసి తీసుకొచ్చారు. ప్రతీరోజు సూపర్‌నేపియర్ పచ్చిగడ్డితో పాటూ, వరిగడ్డిని మేతగా ఇస్తారు. దాణా, పత్తిచెక్క, కంది చున్నీ, ఆయిల్‌పామ్ కేకు, తౌడు, క్యాల్షియం, బెల్లంలను ఆహారంగా ఇస్తారు. రోజుకు రెండు సార్లు బోరు నీటి తో గేదెలను శుభ్రం చేస్తారు. వీటి పోషణ, నిర్వహణలకు ప్రతీరోజు ఎనిమిది మంది పని చేసారు. పాల ఉత్పత్తి అధికంగా ఉండి, ఎక్కువ రోజులు పాలివ్వడం ఈ జాతి గేదెల ప్రత్యేకత. వీటి పాలలో వెన్నశాతం ఎక్కువగా ఉంటుంది.

44 ఎకరాల్లో సేంద్రియ వ్యవసాయం

ఒక నాడు ఒక్క ఎకరంలో పంటలు సాగు చేసిన ఆ కుటుంబం ప్రస్తుతం మరో 44 ఎకరాలను కౌలుకు తీసుకొని వ్యవసాయం చేస్తోంది. నలుగురికి ఉపాధి కల్పిస్తోంది. అందులోని 16 ఎకరాల్లో గేదెలకు అవసరమైన పచ్చిగడ్డిని పెంచుతున్నారు. మిగతా 28 ఎకరాల్లో పత్తి, మిరప, మొక్కజొన్న, కంది పంటలను సాగుచేస్తున్నారు. పురుగు మందులను వినియోగించకుండా సేంద్రియ పద్ధతిలోనే పంటలు పండిస్తున్నారు. అందుకోసం డెయిరీ ఫామ్ పరిసరాల్లోనే 10 సెంట్ల స్థలం లో ఓ గుంతను ఏర్పాటు చేశారు. అందులో గేదె పేడ, మూత్రాన్ని వేసి మురిగించి పైపుల ద్వారా పంటలకు వదులుతున్నారు.

చదువుకున్న యువరాజు



మా తమ్ముడు యువరాజు చదువుకున్నందుకు మా కుటుంబం గురించి ఆలోచించాడు. గతంలో జీవనం గడిపేందుకు తీవ్రమైన ఇబ్బందులు పడ్డాం. మా తమ్ముడికి ఉద్యోగం వచ్చిన తరువాత కుటుంబం కోసం డెయిరీ ఫామ్ ఏర్పాటు చేయించాడు. నేను ఫామ్ నిర్వహణను చూసుకుంటున్నాను. మా పెద్దన్న కౌలు భూముల్లో వ్యవసాయం చేస్తాడు. నాకు నలుగురు, అన్నకు ఇద్దరు పిల్లలున్నారు. అందరినీ చదివించుకుంటున్నాం. అమ్మ, నాన్న మాకు సహాయ సహకారాలు అందిస్తున్నారు.

- రాజు, యువరాజు సోదరుడు

తెల్లవారు జామున మూడింటికే లేస్తాం



రెండు సంవత్సరాల నుంచి డెయిరీ ఫామ్‌లో పనిచేస్తున్నాను. తెల్లవారుజామున మూడు గంటలకు లేచి పేడ తీస్తాం. తరువాత గేదెలను నీటితో శుభ్రం చేస్తాం. 5 గంటల్లోగా పాలు పితికి అయిజలోని కేంద్రంలో పోసి వస్తాను. ప్రతీ రోజు నాకు చేతినిండా పని ఉండటంతో వేరే ఆలోచనలు రావటం లేదు. ఉన్న ఊర్లోనే ఉపాధి లభించడం ఆనందంగా ఉంది. మొదట్లో కొంచె కష్టం అనిపించింది. క్రమంగా అలవాటయ్యింది.

- రంజాన్, ఉత్తనూరు

ఉపాధి కోసం ఇక్కడికి వచ్చాం



మా రాష్ట్రంలో సరైన ఉపాధి అవకాశాలు లేకపోవటంతో కడుపు చేత పట్టుకొని ఉపాధి కోసం ఇక్కడికి వచ్చాం. నాతో పాటూ మరో ముగ్గురు కూడా ఇక్కడే పని చేస్తున్నారు. చేసిన పనికి సరపడా కూలి అందుతోంది. నెలనెలా కొంత డబ్బును ఇంటికి పంపుతున్నాం. మాకు రోజూ పాలు, పెరుగు, మజ్జిగ ఇస్తారు. రాష్ట్రం కాని రాష్ట్రం నుంచి వచ్చిన మమ్మల్ని చాలా మర్యాదగా చూసుకుంటున్నారు.

- విశాల్, బిహార్ రాష్ట్రం

పరీక్ష తప్పిన వారికి ప్రత్యేక తరగతులు


ఖిల్లాఘణపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయులు

వనపర్తి విద్యా విభాగం, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విడుదలైన ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాలలో ఉత్తీర్ణత సాధించని విద్యార్థుల కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తోంది. ఇప్పటికే జిల్లాలోని అన్ని ప్రభుత్వ కళాశాలల్లో బోధనను ప్రారంభించినట్లు జిల్లా విద్యాధికారి ఎర్ర అంజయ్య తెలిపారు. మే 22 నుంచి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. అప్పటిలోగా ఫెయిల్ అయిన సబ్జెక్టులలో విద్యార్థులు పట్టు సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. జిల్లాలోని ప్రభుత్వ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 488, ద్వితీయ సంవత్సరంలో 237 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ప్రత్యేక తరగతులకు హాజరు కాలేని వారికి ఆన్‌లైన్లో సైతం క్లాసులు నిర్వహిస్తున్నారు. ఫెయిల్ అయిన విద్యార్థులకు సంబంధించి సబ్జెక్టుల వారీగా జాబితాను ఇంటర్మీడియట్ విద్యాధికారులు రూపొందించారు. అందుకు అనుగుణంగా ఆయా సబ్జెక్టుల నిపుణులతో విద్యార్థులకు బోధిస్తున్నారు.

100 శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఫెయిల్ అయిన విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణులయ్యేలా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులకు అదనపు తరగతులు కూడా నిర్వహిస్తున్నారు. విద్యార్థులతో ముఖ్యమైన ప్రశ్నలు, పాఠాలు చదివించి, వారికి అర్థమయ్యే రీతిలో బోధిస్తున్నారు. ఉత్తీర్ణత సాధించిన అనంతరం విద్యార్థులకు ఏ కోర్సులో ఆసక్తి ఉందో తెలుసుకొని అందులో రాణించేలా ఇప్పటి నుంచే ప్రోత్సహిస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



ఇంటర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. ఈ అవకాశాన్ని విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకుని ఉత్తీర్ణత సాధించాలి. సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధిస్తే, రెగ్యులర్ విద్యార్థులతో పాటు డిగ్రీలోని వివిధ కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అవకాశం లభిస్తుంది. ఉత్తీర్ణత సాధించకపోతే సంవత్సరం కాలం వృథా అవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

- ఎర్ర అంజయ్య, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

టీటీసీసీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలి

» టీపీసీసీ అధికార ప్రతినిధి గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి

» ముఖ్యమంత్రి , మంత్రులు , ఎంపీ, ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం మే 2 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో టీటీసీసీ శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని టీపీసీసీ అధికార ప్రతినిధి, పాలమూరు పునర్నిర్మాణ పోరం నాయకుడు గాలిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జిల్లా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలకు బహిరంగ లేఖ రాశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలో టెక్నికల్ టీచర్స్ సర్టిఫికెట్ కోర్సు (టీటీసీసీ) శిక్షణ కేంద్రం లేదని లేఖలో పేర్కొన్నారు. నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లొండ, హైదరాబాద్‌లలో శిక్షణ కేంద్రాలున్నాయని తెలిపారు. ప్రతీ ఏడాది వేసవి సెలవుల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి వేలాదిమంది నిరుద్యోగులు శిక్షణ కోసం వందలాది కిలోమీటర్ల దూరంలోని ఆయా పట్టణాలకు వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు. డ్రాయింగ్, టైలరింగ్, క్రాఫ్ట్, మ్యూజిక్, ఎంబ్రాయిడరీ తదితర కోర్సుల శిక్షణ కేంద్రాలను పాలమూరు, వనపర్తి జిల్లాల్లో ఏర్పాటు చేయాలని మూడు నెలలుగా అధికారులకు విన్నవిస్తున్నా స్పందించడం లేదని ఆరోపించారు. కేంద్రాల ఏర్పాటుకు సీఎం అనుమతి తప్పనిసరి అంటున్నారని పేర్కొన్నారు. ఇంకా వచ్చేనెల 11 వరకు సమయం ఉన్నందున ఎంపీ, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి రెండు జిల్లాల్లో శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు అనుమతి ఇప్పించాలని కోరారు. అందుకు సంబంధించిన అధ్యాపక పోస్టులను కూడా మంజూరు చేయించాలని కోరారు.

క్రీడాకారులకు నగదు బహుమతులు


సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో రన్నర్స్‌గా నిలిచిన బాల, బాలికల జిల్లా జట్లతో కోచ్ పర్వేజ్ పాషా


మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సీఎం కప్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో రన్నర్‌గా నిలిచిన జిల్లా బాల, బాలికల జట్లకు శుక్రవారం నగదు బహుమతులు అందించారు. గత ఏడాది డిసెంబర్ నెలలో ఖమ్మం పట్టణంలో నిర్వహించిన సీఎం కప్ వాలీబాల్ పోటీల్లో బాల, బాలికల జిల్లా జట్లు రన్నర్‌గా నిలిచి రజత పథకాలు సాధించాయి. ఖమ్మం స్టేడియంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో రెండు జట్లకు వేర్వేరుగా రూ. 75 వేలు, క్రీడాకారులకు ధ్రువపత్రాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారితో పాటు కోచ్ పర్వేజ్‌లను డీవైఎస్‌వో ఎస్.శ్రీనివాస్, వాలీబాల్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శాంతికుమార్, కురుమూర్తిగౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ చెన్నవీరయ్య అభినందించారు.

పోలీసులను కొరికిన ఆటో డ్రైవర్

- నో పార్కింగ్ వద్ద ఆటోను నిలిపిన డ్రైవర్
- పక్కకు తీయాలని చెప్పినందుకు దాడి
- ఇద్దరు కానిస్టేబుళ్లకు గాయాలు

అలంపూరు చౌరస్తా, మే 2 (ఆంధ్రజ్యోతి) : రాంగ్ పార్కింగ్‌లో నిలిపిన ఆటోను పక్కకు తీయాలని చెప్పిన పోలీసులపై ఆటో డ్రైవర్ దాడి చేశాడు. రక్తం వచ్చేలా కొరికి గాయపరిచాడు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అలంపూరు చౌరస్తాలో గురువారం కానిస్టేబుళ్లు వనపర్తి రవి, అబ్దుల్‌బాషా, హోంగార్డు మద్దిలేటి బ్లూకోల్ట్ విధుల్లో ఉన్నారు. సాయంత్రం పోలీస్ అవుట్ పోస్టు ముందు రాంగ్ పార్కింగ్ చేసిన ఓ ఆటోను పక్కకు తీయాలని డ్రైవర్‌కు చెప్పాడు. ఉండవల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ సాయికుమార్ వారి దుర్భాషలాడారు. వారించేందుకు ప్రయత్నించిన వనపర్తి రవి, అబ్దుల్‌బాషాలపై దాడి చేసి కొరకడంతో ఇద్దరికీ రక్తగాయాలయ్యాయి. రవికి రక్తసావమైంది. సంఘటనపై పోలీసు సిబ్బంది ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ వీరన్న తెలిపారు.

యువకుడి బలవన్మరణం


బోయిన సంతోష్ (ఫైల్)

దామరగిద్ద, మే 2 (ఆంధ్రజ్యోతి) : కడుపునొప్పి భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. నారాయణపేట జిల్లా, దామరగిద్ద మండల పరిధిలోని కానుకుర్తి గ్రామంలో శుక్రవారం ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాజు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బోయిని సంతోష్ (22) కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడు. గురువారం రాత్రి నొప్పి తీవ్రం కావడంతో 11 గంటల సమయంలో ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తమ్ముడు బోయిని రవికుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మైనర్లకు కౌన్సెలింగ్

భూత్పూర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : అర్ధరాత్రి కారులో తిరుగుతున్న ఆరుగురు మైనర్ బాలబాలికలను పోలీసులు పట్టుకున్నారు. వారి తల్లిదండ్రులను శుక్రవారం పోలీస్ స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. ఎస్ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఓ పట్టణానికి చెందిన నలుగురు మైనర్ బాలురు, ఇద్దరు మైనర్ బాలికలు ఏప్రిల్ 30వ తేదీ అర్ధరాత్రి భూత్పూర్ చౌరస్తాలో కారులో ప్రయాణిస్తుండగా గస్తీలో ఉన్న ఎస్ఐ చంద్రశేఖర్, సిబ్బందితో కలిసి కారును ఆపారు. అందులో ఆరు మంది మైనర్ బాల బాలికలు ఉన్నారు. వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలిం చి విచారించారు. ఎస్పీ ఆదేశం మేరకు వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన సీఐ రామకృష్ణ, ఎస్ఐ చంద్రశేఖర్ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

గన్నీ బ్యాగుల కోసం చెప్పుల వరుస


గన్నీ బ్యాగుల కోసం చెప్పులను వరుసలో ఉంచిన రైతులు

నారాయణపేట, మే 2 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో మెప్మా ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో శుక్రవారం గన్నీ బ్యాగుల కోసం రైతాంగం వరుస క్రమంలో చెప్పులను ఉంచారు. పెద్ద ఎత్తున చెప్పులు ఉంచి గన్నీ బ్యాగుల కోసం నారాయణపేట మండలం పేరపళ్ల, శేర్నపల్లి తదితర గ్రామాల రైతులు నిరీక్షించారు. అయితే కంటైనర్‌లో పది వేల బ్యాగులు రావడంతో బ్యాగుల కోసం రైతులు ఆరాట పడ్డారు. పోలీసుల సహకారంతో గంట లోపే పదివేల గన్నీ బ్యాగులు రైతులు పొందడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పటి వరకు 60 వేల గన్నీబ్యాగులు రైతులకు ఇవ్వగా 22 వేల బస్తాలు కొనుగోలు చేయడం జరిగిందని మెప్మా నిర్వాహకులు తెలిపారు.

రికార్డు స్థాయిలో ఆదాయం

- ఈ ఏడాది రూ.నాలుగు కోట్ల రాబడి
- ధాన్యం కొనుగోలు చేస్తే మరింత ఆదాయం
- అభివృద్ధిపథంలో అలంపూరు మార్కెట్



పత్తి లారీనుంచి మార్కెట్ సెస్ వసూలు చేస్తున్న అలంపూరు మార్కెట్ శాఖ అధికారులు (ఫైల్)



అలంపూరు వ్యవసాయ మార్కెట్ యార్డు

అలంపూరుచౌరస్తా, మే 2 (ఆంధ్రజ్యోతి): అలంపూరు వ్యవసాయ మార్కెట్ ఆదాయం మూడు పువ్వులు ఆరుకాయలు అన్న చందంగా ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా, గడిచిన ఆర్థిక సంవత్సరంలో రికార్డుస్థాయిలో ఆదాయం వచ్చింది. అలంపూరు వ్యవసాయ మార్కెట్ పరిధిలో ఎనిమిది మండలాలు, నాలుగు చెక్ పోస్టులు ఉన్నాయి. దీనికితోడు అయిజ మునిసిపాలిటీలో పశువుల సంత నిర్వహిస్తున్నారు. ఇలా గడిచిన ఆర్థిక సంవత్సరంలో రూ.4.7కోట్ల ఆదాయం సమకూరిందని అలంపూర్ వ్యవసాయ మార్కెట్ సెక్రటరి ఎల్లస్వామి తెలిపారు.

రాబడి డబుల్

2022-23వ ఆర్థిక సంవత్సరం పశువుల సంత ద్వారా రూ.2.24లక్షలు రాగా డైరెక్ట్‌గా వ్యాపారస్థుల ద్వారా రూ.91.9లక్షలు, చెక్ పోస్టుల ద్వారా రూ.44.67లక్షలు, ప్రభుత్వ సంస్థల ద్వారా రూ.44.67 లక్షలు వచ్చింది. ఆ తర్వాత ఏడాది 2023-24లో పశువుల సంత ద్వారా రూ.19.94 లక్షలురాగా డైరెక్ట్ వ్యాపారస్థుల ద్వారా రూ.1.45 కోట్లు, చెక్‌పోస్టుల ద్వారా రూ.1.26కోట్లకు, ప్రభుత్వ సంస్థల ద్వారా రూ.43.15లక్షలకు పెరిగింది. ఇక 2024-25వ ఆర్థిక సంవత్సరంలో మరింత పుంజుకుని పశువుల సంత ద్వారా రూ.2.16 కోట్లకు, డైరెక్ట్ వ్యాపారస్థుల ద్వారా రూ.1.39కోట్లు, చెక్‌పోస్టుల ద్వారా రూ.1.76కోట్లు, ప్రభుత్వ సంస్థల ద్వారా రూ. 69లక్షల ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. నూతన ఆర్థిక సంవత్సరంలో మొదటి నెలలో సుమారు రూ.కోటి వరకు ఆదాయం వచ్చినట్లు తెలిపారు.

ధాన్యం కొనుగోలు చేయాలి

అలంపూరు నియోజకవర్గంలో అత్యధికంగా ప్రజలు వ్యవసాయ ఆధారిత జీవనం కొనసాగుతున్నది. రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులు విక్రయించేందుకు సరైన మార్కెటింగ్ వ్యవస్థ నేటికీ ఏర్పాటు చేయకపోవడం రైతులపాలిట శాపంగామారింది. దళారులు, వ్యాపారస్థులు రైతుల నుంచి కొనుగోలు చేసి ఇతర ప్రాంతాల్లోని వ్యవసాయ మార్కెట్లకు తరలిస్తున్నారు. ఇలా తరలిస్తున్న వ్యాపారస్థుల నుంచి వసూలు చేస్తున్నందు వల్లే మార్కెట్ ఆదాయం ఈ రెండేళ్లలో డబుల్ అయ్యింది. ఇక్కడే ధాన్యం కొనుగోళ్లతో పాటు అలంపూరు చౌరస్తాలో పశువుల సంత నిర్వహిస్తే మరింత ఆదాయం వచ్చే అవకాశం ఉంది. రెండేళ్లక్రితం ఇతర ప్రాంతాలకు తరలుతున్న ధాన్యపు లారీల నుంచి ఎలాంటి సెస్ వసూలు చేయడానికి సాహసించేవారు కాదు. సెక్రటరీగా ఎల్లస్వామి బాధ్యతలు చేపట్టాక నూతనంగా అలంపూరు వద్ద ర్యాలంపాడు చెక్ పోస్టును ప్రారంభించి ఆదాయ మార్గాలను అన్వేషించడం మొదలుపెట్టారు. నియోజకవర్గంలో అత్యధికంగా పత్తి, కంది, మిరప, మొక్కజొన్న పంటలు పండిస్తారు. వీటిని కొనుగోలు చేసిన వ్యాపారస్తులను బార్డర్ ఏరియాల్లో నిఘాపెట్టి దాడులు చేసి మార్కెట్ సెస్ వసూలు చేయడంతోనే ఇంత ఆదాయం వస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు.

ఆదాయం పెంచేందుకు కృషి



అలంపూరు వ్యవసాయ మార్కెట్‌కు మరింత ఆదాయం వచ్చేలా కృషి చేస్తాం. అలంపూరు చౌరస్తాలో పశువుల సంతతో పాటు,ధాన్యం కొనుగోళ్లకు గతేడాది నుంచి ప్రయత్నిస్తున్నాం. దీనికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులతో, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి మార్కెట్‌ను రైతులకు అందుబాటులోకి తెస్తాం.

- ఎల్లస్వామి, అలంపూరు వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యదర్శి

న్యూస్ బాక్స్

అలంపూర్ ఆలయాలకు వెండి ప్లేట్ల వితరణ



ఆలయ ఈవోకు వెండిప్లేట్లు ఇస్తున్న భద్రయ్య

అలంపూరు మే 2(ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామివారి ఆలయాలకు హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి వాస్తవ్యులు గ్రీష్మ తండ్రి భద్రయ్య రెండు వెండిప్లేట్లను శుక్రవారం వితరణ చేశారు. ఈ వెండి ప్లేట్లు సుమారు 340 గ్రాముల బరువు ఉంచి రూ.34వేల విలువ ఉంటుందని ఈవో పురేందర్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో వెంకట్రామయ్య శెట్టి పాల్గొన్నారు.

రైతులకు పశుగ్రాసం ఇవ్వాలి: బీఆర్ఎస్

అలంపూరుచౌరస్తా, మే 2(ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండలం, ప్రాగటూరులో పశుగ్రాసం దగ్ధమై నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జిల్లా కోఆర్డినేటర్ కుర్వపల్లయ్య కోరారు. 18 గడ్డివాములు దగ్ధం కావడం బాధాకరమని, వెంటనే రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ముందుకురావాలన్నారు. ఇందుకు బాధ్యులైన వారిని గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

ఆలయ భూముల వేలం వాయిదా

అలంపూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో మొదటి పర్యాయం ఏప్రిల్ 21న నిర్వహించిన ఆలయ భూముల కౌలు బహిరంగ వేలంలో సరైనధర రాకపోవడంతో వాయిదా పడిన ఆరు సర్వే నెంబర్లకు రెండవ పర్యాయము శుక్రవారం కౌలు బహిరంగ వేలం నిర్వహించారు. కానీ వేలంలో ఆరు సర్వే నెంబర్లలో ఒక సర్వే నెంబరు కర్నూలు జిల్లా కల్లూరు శివారు సర్వేనెంబర్ 346/1,346/3 విస్తీర్ణం 15-18 ఎకరాలకు ఇద్దరు మాత్రమే డిపాజిట్ చెలించి వేలంలో పాల్గొన్నారు. వేలం షరతుల ప్రకారం కనీసం ముగ్గురు డిపాజిట్ చెల్లించి వేలంపాటలో పాల్గొనాల్సి ఉంటుంది. ఇద్దరు డిపాజిట్ చేయడం, మిగతా సర్వేనెంబర్లకు ఎవరూ పాల్గొనకపోవడంతో ఈ వేలంపాటను ఈనెల 16కు వాయిదా వేశామని ఈవో పురేందర్ కుమార్ తెలిపారు.

ఘనంగా ఆరుద్రోత్సవం



గోమాతతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

అలంపూరు మే 2(ఆంధ్రజ్యోతి): ఐదవ శక్తిపీఠంలో శుక్రవారం ఆరుద్రోత్సవం ఘనంగా నిర్వహించారు. స్వామివారికి అన్నప్రసాదాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గణపతి పూజ చేసి, గోమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. శుక్రవారం ఆదిశంకరాచార్య జయంతి సందర్భంగా పూజలు నిర్వహించారు.

క్రీడా శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

మల్దకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నాగరాజు అన్నారు. శుక్రవారం మండలంలోని ఎల్కూరులో ఏర్పాటు చేసిన శిక్షణ శిబిరంలో వాలీబాల్ క్రీడను ప్రారంభించి నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో నిర్వాహకులు రవికుమార్, టీచర్ గంగన్న ఉన్నారు.

పింఛన్ కోసం కలెక్టరేట్ వద్ద దివ్యాంగుడి నిరసన

గద్వాల న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పింఛన్ కోసం ఓ దివ్యాంగుడు, బంధువులు శుక్రవారం కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఇందుకు సంబంధించి యంగ్ టర్క్స్ స్థాపకుడు తరుణ్‌రెడ్డి. బాధిత బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానవపాడు మండలం పెద్దఆముదాలపాడుకు చెందిన దివ్యాంగుడు ఎం.ఎబన్నకు పింఛన్ ఇవ్వాలని కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో గత డిసెంబర్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి సమస్యను విన్నవించాడు. దీంతో పింఛన్ వచ్చేలా చూడాలని మంత్రి కలెక్టర్‌కు తెలిపారని, అయినా అందకపోవడంతో నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఇప్పటికైనా పింఛన్ ఇవ్వాలని అధికారులను కోరారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

గద్వాల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న పాలిసెట్-2025 ప్రవేశ పరీక్ష ఉంటుందని గద్వాల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ రామ్మోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ప్రతీ సబ్జెక్టుకు గంట చొప్పున శిక్షణ ఉంటుందని తెలిపారు. గణితం, భౌతిక, రసాయనశాస్త్రం సబ్జెక్టు గల విద్యార్థులు స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గోనుపాడు వద్ద ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

తెలుగు ప్రజలకు ఏసుక్రీస్తు ఆశీస్సులు ఉండాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ శాంతికోసం, రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలు, సోదరభావంతో జీవించాలని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని గుత్తి బైబిల్‌మిషన్ ప్రార్థన మందిరం మహిమ సువార్తసభలు, సంగీత మహోత్సవ కార్యక్రమాలు మూడు రోజులుగా రెవరెండ్. బి.అద్భుత కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతుండగా చివరి రోజు శుక్రవారం ప్రత్యేక ఆహ్వానితులుగా ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా గద్వాల నియోజకవర్గం అభివృద్ధి కోసం, గద్వాల జిల్లా ప్రజలకు సకాలంలో వర్షాలు పడుతూ సుభిక్షంగా ఉండేలా అద్భుతకుమార్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వినియోగదారుల ఫోరం మాజీ అధ్యక్షులు గట్టు తిమ్మప్ప, గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ, నాయకులు కురుమన్న, విజయ్, మహేశ్ తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు చైర్మన్, వైఎస్ చైర్మన్ పరామర్శ

● సంఘటనా స్థలాన్ని పరిశీలించిన చైర్మన్, వైస్ చైర్మన్



ప్రాగటూరులో ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న అలంపూర్ మార్కెట్ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్

ఉండవల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రాగటూరులో ఎద్దులబండ్లు, మోటార్లు ఆయిల్ ఇంజన్లతో పాటు వందకుపైగా పైపులు కాలిబూడిదయ్యాయి. ఈవిషయం తెలుసుకున్న అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప, వైస్ చైర్మన్ పచ్చర్లకుమార్ శుక్రవారం గ్రామానికి వెళ్లి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధిత రైతులను, కుటుంబాలను చైర్మన్, వైఎస్ చైర్మన్ పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. 18 గడ్డివాములు, 800 పీవీసీ పైపులు కాలిపోయాయని, వాటితో పాటు ఎద్దుల బండ్లు కూడా పూర్తిగా దగ్ధమయ్యాయని చైర్మన్‌కు వివరించారు. బాధితులకు తక్షణమే న్యాయం చేయాలని అధికారులను కోరారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

అగ్ని ప్రమాదంలో పూర్తిగా నష్టపోయిన రైతులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకటస్వామి అన్నారు. ప్రమాద ఘటన గురించి తెలుసుకుని జిల్లా కమిటీ సభ్యులతో కలిసి గ్రామానికి వెళ్లి కాలిపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు. బాధిత రైతులకు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెంకటస్వామి మాట్లాడారు. 12మంది రైతుల 18గడ్డివాములు పూర్తిగా మంటల్లో దగ్ధమయ్యాయని, దాదాపు రూ.25లక్షలనష్టం వాటిల్లిందన్నారు. రైతులకు ప్రభుత్వం పరిహారం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు రేపల్లె దేవదాస్, సింగరాజు, మద్దిలేటి, జీకే ఈదన్న, మండల కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, శాఖ కార్యదర్శి మధు, రంగన్న, చెన్నరాముడు, హుస్సేన్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ నిర్లక్ష్యం

● బీఆర్ఎస్ నాయకుడు హన్మంతునాయుడు



గట్టులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గట్టు, మే 2 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ధాన్యం కొనుగోలులో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నదని బీఆర్ఎస్ నాయకుడు బాసు హన్మంతునాయుడు మండిపడ్డారు. శుక్రవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. రైతులకు మద్దతు ధర కల్పిస్తామని మోసపూరిత మాటలు చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గద్దెనెక్కిన అనంతరం మోసం చేసిందన్నారు. గిట్టుబాటు ధరతో పాటు బోనస్ ఇస్తామని రైతులను నట్టేట ముంచిందన్నారు. కార్యక్రమంలో రామునాయుడు, భాస్కర్‌నాయుడు, రాజునాయుడు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ప్రతీ రైతుకు 11నెంబర్లతో విశిష్ట సంఖ్య

● మండల వ్యవసాయ అధికారులతో జిల్లా అధికారుల వీడియో కాన్ఫరెన్స్

మల్దకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతీ పౌరుడికి ఆధార్‌తో గుర్తింపు ఇచ్చిన విధంగా ప్రతి రైతుకు 11నెంబర్లతో విశిష్ట సంఖ్యను కేటాయించాలని కేంద్రం నిర్ణయం తీసుకుందని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులు వివరించారు. మల్దకల్‌లోని రైతువేదికలో శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజేషన్ చేయాలన్న సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం సహకారంతో ఈ ప్రాజెక్టును చేర్చిందన్నారు. భూమిఉన్న ప్రతీ రైతు తనకు ఉన్న భూములకు సంబంధించిన వివరాలతో కూడిన సమాచారంతో ఫార్మన్ రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ అనుసంధానం చేస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాలైన రైతుభరోసా, రుణమాఫీ తదితర వాటికి ఫార్మర్ రిజిస్ట్రీకి ఎలాంటి సంబంధం లేదన్నారు. రైతు విశిష్ట సంఖ్యను పొందేందుకు మీ ఆధార్, భూయాజమాన్య పాస్‌బుక్ ఆధార్‌కార్డుకు లింక్ చేయబడిన, మొబైల్ నెంబర్ తీసుకుని సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ వ్యవసాయ సంచాలకులు సంగీతలక్ష్మి, డివిజన్ అధికారులు, విస్తరణ అధికారులు పాల్గొన్నారు.

ఉగ్రదాడులను ముక్తకంఠంతో ఖండించాలి



కృష్ణవేణి సర్కిల్ వద్ద కొవ్వొత్తులు వెలిగించి నిరసన తెలుపుతున్న సీపీఎస్‌ఈయూ నాయకులు

గద్వాలటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడి, మారణహోమం అత్యంత క్రూరమని సీపీఎస్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు అన్నారు. నరరూప రాక్షసులైన ఉగ్రవాదుల దాడులను యావత్ ప్రజానీకం ముక్తకంఠంతో ఖండించాలన్నారు. ఉగ్రదాడిలో మృతిచెందిన అమరులను స్మరిస్తూ శుక్రవారం వారికి సంతాప సూచకంగా స్థానిక కృష్ణవేణి చౌరస్తాలో యూనియన్ నాయకులు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈసందర్భంగా ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేసిన ఉద్యోగులు బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌కుమార్, నరసింహ, ఎల్లస్వామి, ఖాజా అమీర్, మస్తాన్ వలి, రాజేశ్, పరశురామ్, ఆంజనేయులు, మదన్, నాగరాజు, మహేష్, షేక్షావలి, నరసింహ, రమేష్, సంపంగి సంతోష్, వీరేష్ ఉన్నారు.

విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి



గద్వాలలోని అంబేడ్కర్ సర్కిల్ వద్ద విద్యార్థినుల ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

గద్వాల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంబారిన పడి మృతిచెందిన నర్సింగ్ కళాశాల విద్యార్థినుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ పార్టీ గద్వాల ముఖ్యనాయకుడు బాసు హనుమంతునాయుడు డిమాండ్ చేశారు. విద్యార్థునుల మృతి తీవ్ర విచారకరమని వారి కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలిపారు. రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన విద్యార్థినుల చిత్రపటాలకు శుక్రవారం రాత్రి పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి, మౌనం పాటించి నివాళి అర్పించారు. వారి ఆత్మకుశాంతి చేకూరాలని భవంతుని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన హనుమంతునాయుడు, మృతిచెందిన బాలికల కుటుంబాలకు రూ.50లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో కురువ పల్లయ్య, చక్రధర్‌రావు, రామకృష్ణముదిరాజ్, మోనేష్, శ్రీను, రాజు, బీచుపల్లి. మల్లికార్జున్, శ్రీరాములు, మారెప్ప, తిరుమలేష్, శ్రీనివాసులు, వీరేశ్, మన్యం, రాజు, గంగాధర్, వెంకటేశ్ ఉన్నారు.

టెన్త్ విద్యార్థినిని అభినందించిన కలెక్టర్



విద్యార్థిని అక్షయను అభినందిస్తున్న కలెక్టర్

గద్వాల న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో 566 మార్కులు సాధించిన ప్రభుత్వపాఠశాల విద్యార్థిని ఎస్.అక్షయను కలెక్టర్ బీఎం సంతోష్ అభినందించారు. శుక్రవారం ఐడీవోసీ లోని తమ చాంబర్‌లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో చదువుతున్న అక్షయ పదవ తరగతి బోర్డు పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన సందర్భంగా ఆమెను అభినందించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో రాణించగలరన్నారు. విద్య ద్వారా బాలికల సాధికారత పెరుగుతుందని, విద్యార్థులను అన్నివిధాలుగా ప్రోత్సహిస్తున్నామన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్.ఎం.జహీరుద్దీన్, సిబ్బంది ఉన్నారు.

● హాస్టల్ వెల్ఫేర్ అభ్యర్థులకు..

శుక్రవారం ఐడీవోసీ కలెక్టర్ చాంబర్‌లో ప్రభుత్వ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ గ్రేడ్- 2కు ఎంపికైన అభ్యర్థులను కలెక్టర్ అభినందించారు. తమ హాస్టల్స్‌లో విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని, విద్యార్థుల భద్రత, ఆహారం, వసతి, మొదలైన వాటిపై శ్రద్ధ పెట్టి పనిచేయాలని సూచించారు. ఎంపికైన వారిలో మన్నెసాయి సౌజన్య. సురేష్‌గౌడ్, బస్వరాజు, రమేశ్,ఆంజనేయులు, రాంగోపాల్, జయరాం, శేషన్న, నరేష్ తదితరులు ఉన్నారు. వీరికి సంబంధించిన వసతిగృహాలకు పోస్టింగ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమాధికారి సరోజ, సిబ్బంది మల్లికార్జున్ ఉన్నారు.

భూ భారతి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు

● పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

గద్వాల న్యూటౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం నిబంధనల మేరకు ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖామంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి భూ భారతి చట్టం, రెవెన్యూ సదస్సులు, నీట్ ప్రవేశపరీక్ష నిర్వహణ, ఇందిరమ్మ ఇళ్లపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఈనెల 5నుంచి 20వరకు పైలట్ ప్రాజెక్టు జిల్లాలు మినహాయించి మిగిలిన జిల్లాల్లో ఒక మండలాన్ని పైలట్‌గా తీసుకొని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోవాలన్నారు. జూన్ 2వరకు పైలట్ ప్రాజెక్టు కింద వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. మే చివరి వరకు రెవెన్యూ సదస్సుల ద్వారా వచ్చిన ప్రతీ దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి తప్పులు లేకుండా పరిష్కారం చూపాలని మంత్రి పేర్కొన్నారు. నీట్ పరీక్ష కేంద్రాలను ముందుగా కలెక్టర్, పోలీస్ ఉన్నతాధికారులు స్వయంగా పరిశీలించి ఏర్పాట్లను పర్యవేక్షించాలన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేయాలన్నారు. ప్రశ్నపత్రాలు స్టోర్ చేసే స్ట్రాంగ్ రూమ్ వద్ద సీసీటీవీ ఉండాలన్నారు. పోలీస్ బందోబస్తుతో పరీక్ష కేంద్రాలకు ప్రశ్నాపత్రాలను తరలించాలన్నారు. గతంలో జరిగిన ఎటువంటి పొరపాట్లు మరోసారి పునరావృతం కాకుండా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలన్నారు. పేదలకు ప్రభుత్వం అందించే ఇందిరమ్మ ఇళ్లు అర్హులకు అందేలా చూడాలన్నారు. అర్హుల జాబితా ఎంపిక చేయడం చాలా కీలకమన్నారు. సమావేశంలో కలెక్టర్ బీఎం సంతోష్, ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, తహసీల్దార్లు, హౌసింగ్ అధికారులు ఉన్నారు.

పైలట్ ప్రాజెక్టుగా ఇటిక్యాల మండలం ఎంపిక

భూ భారతి చట్టం అమలుకు ఈనెల 5 నుంచి 16 వరకు ఇటిక్యాల మండలాన్ని పైలట్‌గా ఎంపిక చేసినందున తహసీల్దార్లు పూర్తిగా సిద్ధంగా ఉండి భూ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో భూభారతి చట్టం, రెవెన్యూ సదస్సుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి చట్టం అమలులో భాగంగా ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ఈనెల 5న గోపల్‌దిన్నె, 6న వావిలాల, 7నపెద్దదిన్నె, 8న సాతర్ల, 9న ఎం.ఆర్.చెరువు, 12న షాబాద్, 13న ఇటిక్యాల, 14న చాగాపురం, 15నమునగాల, 16న ఉదండాపురంలో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అదనపుకలెక్టర్, తహసీల్దార్లు ఉన్నారు.

కులగణన నిర్ణయం చరిత్రాత్మకం



గద్వాల పాత బస్టాండ్ సర్కిల్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు

గద్వాల టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): జనగణనతో పాటు దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. ప్రధాని మోదీ నిర్ణయంతో దేశంలోని బీసీలకు తగిన తోడ్పాటు లభించడంతో పాటు సామాజిక న్యాయానికి మార్గం సుగమమైందన్నారు. కులగణన నిర్ణయాన్ని స్వాగతిస్తూ శుక్రవారం పట్టణంలోని పాతబస్టాండ్ సర్కిల్‌లో బీజేపీ నాయకులు ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బండల వెంకట్రాములు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎగ్బోటే, ఉపాధ్యక్షుడు నరసింహ, ఓబీసీ, మైనార్టీ మోర్చాల అధ్యక్షుడు దేవదాసు, మాలిక్ ఇసాక్, ఐటీ సెల్ కన్వీనర్ చిత్తారి కిరణ్, కృష్ణ, తిరుపతిరెడ్డి, శ్రీనివాసులు, బాలేశ్వర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, రమేశ్, వెంకటేశ్, నరసింహ ఉన్నారు.

● అయిజ టౌన్: కేంద్ర ప్రభుత్వం చేపట్టే కులగణన కార్యక్రమం చరిత్రలో నిలుస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం అయిజలో వివిధ కులసంఘాల నాయకులకు ఆయన సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన కూడా చేసేందుకు మోదీ కేబినెట్ నిర్ణయం తీసుకోవటం సంతోషించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా కార్యవర్గసభ్యుడు మాదన్న, జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మన్‌గౌడు, బూత్ అధ్యక్షుడు రాజశేఖర్, రఘు, వివిధ కులసంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీలింగ్ భూమి స్వాధీనం



సీలింగ్ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తెలుపుతున్న రెవెన్యూ అధికారులు

మానవపాడు, మే 2 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నారాయణపురం శివారులోని సర్వే నెంబర్ 36లోని మొత్తం 9.25 గుంటల్లో నారాయణపురానికి చెందిన దళితులకు గతంలో సీలింగ్ కింద పలువురికి ఇచ్చారు. ఈ క్రమంలో 36 సర్వే నెంబర్ భూమిలో 2.38 గుంటల భూమి రాఘవేంద్రస్వామి, శ్రీ రాఘవేంద్ర స్వామి ట్రస్ట్ పేరుపై కొనుగోలు చేసి నమోదు చేసుకుని రెవెన్యూ రికార్డుల్లో పేర్లు నమోదు చేసుకున్నారు. భూములు బదలాయింపు నిషేధ చట్టం 1977 ప్రకారం ఈ భూమిని ఆక్రమించుకున్న, స్వాధీనపరిచిన వారికి చట్టం వర్తిస్తుందని భూమిని స్వాధీన పరుచుకున్న వ్యక్తులకు రెండు నోటీసులు ఇచ్చి, దీనికి సంబంధించిన సమాధానం సమయానికి రాకపోవడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ జ్యోషి శ్రీనివాస్ శర్మ తెలిపారు.

'ఎర్లీబర్డ్'తో ఇంటి పన్ను వసూళ్లు

- 5 శాతం డిస్కౌంట్‌తో ఈ నెల 7వరకు అవకాశం
- శుక్రవారం నాటికి రూ.32 లక్షలు వసూలు చేసిన సిబ్బంది

అయిజ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం మునిసిపాలిటీల్లో ' ఎర్లీబర్డ్ ప్రత్యేక కార్యక్రమంతో ఇంటి పన్నుల వసూలుకు శ్రీకారం చుట్టింది. ఆర్థిక సంవత్సరం ముగిసిన వెంటనే ఏప్రిల్ 1వ తేదీ నుంచి30 వరకు ఈ ప్రత్యేక కార్యక్రమం ద్వారా ఇంటిపన్నులు వసూలు చేసేందుకు అవకాశం కల్పించింది. 5శాతం డిస్కౌంట్‌తో ఈ నెలరోజుల్లో ప్రజల నుంచి ఇంటి పన్నులు వసూలు చేసే వెసులుబాటును కల్పించారు. తాజాగా ప్రభుత్వం ఈ అవకాశాన్ని ఈనెల 7వ తేదీ వరకు పొడిగించటంతో మునిసిపాలిటీ కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్ల ద్వారా ఇంటి పన్నులు వసూలు చేస్తున్నారు. అయిజ మునిసిపాలిటీలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నుల పన్నుల వసూలు లక్ష్యం రూ.1.62 కోట్లు. ఎర్లీబర్డ్ ప్రత్యేక కార్యక్రమంతో గురువారం నాటికి రూ.32లక్షల ఇంటి పన్నూలు వసూలయ్యాయి. మరో అయిదు రోజుల గడువులో రూ.10 నుంచి రూ.15లక్షల వరకు ఐదుశాతం డిస్కౌంట్‌తో ఇంటి పన్నులు వసూలు అయ్యే అవకాశం ఉందని కమిషనర్ సైదులు తెలిపారు. పట్టణ ప్రజలు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటిపన్నులు చెల్లించాలని ఆయన కోరారు. మునిసిపాలిటీ సిబ్బంది వార్డుల్లో పర్యటించి ఇళ్లవద్దకే వచ్చి పన్నులు కట్టించుకుంటున్నారని, సౌకర్యం కోసం కార్యాలయంలో కూడా ప్రత్యేక కౌంటర్ ద్వారా పన్నులు చెల్లించే ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు.